క్లుప్తంగా

కోనేటిరాయుని హుండీ లెక్కింపు

గంగవరం : మండలంలోని కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో టీటీడీ అధికారులు శుక్రవారం హుండీ లెక్కింపు చేపట్టారు. ఐదు నెలల్లో స్వామివారికి గత 5 నెలల్లో భక్తులు హుండీ ద్వారా రూ.9.12లక్షలు సమర్పించినట్లు టెంపుల్ ఇన్స్పెక్టర్ గజేంద్ర తెలిపారు.

కావమ్మ, మారయ్య తిరునాళ్ల ప్రారంభం

సదుం: భట్టువారిపల్లెలోని కావమ్మ, మారయ్య ఆలయంలో శుక్రవారం తిరునాళ్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, ఆరాధన నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు రాత్రి జంగాలకథ వినిపించారు. బెస్త సంఘం నాయకులు పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

పుంగనూరు : పట్టణంలోని విరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని జీడిపప్పు, ద్రాక్షతో అలంకరించారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో మారెమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఫారమ్-16 పంపిణీ


ఫారమ్-16లను అందిస్తున్న ఎస్టీఓ మునికృష్ణయ్య

పలమనేరు : పలమనేరు సబ్ ట్రెజరీ పరిధిలో ఏడాదికి రూ.3.5లక్షల కంటే ఎక్కువగా పింఛన్ పొందే విశ్రాంత ఉద్యోగులకు ఫారమ్-16, పార్ట్ ఏ, బీలను శుక్రవారం ఎస్టీఓ మునికృష్ణయ్య పంపిణీ చేశారు. తమ కార్యాలయ పరిధిలో 400 మంది వరకు ఇన్కంటాక్స్ చెల్లించేందుకు ఫారమ్స్‌ను భర్తీ చేసి ఇవ్వాల్సి ఉంటుందని వెల్లడించారు. అప్లికేషన్లు అందజేసిన ఎస్టీఓకు పెన్షనర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు గురురాజారావు, గౌస్, కృష్ణమూర్తి, జానకిరామయ్య పాల్గొన్నారు.

విశ్వనాథరెడ్డికి సతీవియోగం


భాగ్యవతి (ఫైల్)

పలమనేరు : సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, మొరం పంచాయతీ సర్పంచ్ విశ్వనాథరెడ్డి సతీమణి భాగ్యవతి(56) శుక్రవారం కన్నుమూశారు. మూడురోజుల క్రితం మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతల కుటుంబాలు షిరిడీ యాత్రకు వెళ్లాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి షిరిడీలోని ఓ లాడ్జిలో బస చేసిన విశ్వనాథరెడ్డి భార్య తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే విశ్వనాథరెడ్డి ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భాగ్యవతి భౌతికకాయానికి ఆదివారం వారి స్వగ్రామమైన నక్కపల్లె అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు


విశేషాలంకరణలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో శుక్రవారం పౌర్ణమి పూజలను ఘనంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 6 గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి అష్టోత్తర శతనామావళి పారాయణం చేశారు. కలశ పూజ, చంద్రపూజ నిర్వహించారు. ఉత్సవ మూర్తులైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి మహారాజ అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

గుణాత్మక విద్య అవసరం

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్యనందించడం అవసరమని ఎంఈఓ రుషేంద్రబాబు ఆదేశించారు. గూబలవారిపల్లె, చుక్కావారిపల్లె, అక్కంచెరువుపల్లె ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. టీచర్లు దేవి, సుధాకర్, కరుణ పాల్గొన్నారు.

25 నుంచి రామాలయంలో ధార్మిక కార్యక్రమాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం):చిత్తూరు నగరంలోని కోదండరామాలయంలో ఈ నెల 25వ తేదీ నుంచి టీటీడీ ఆధ్వర్యంలో పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వేణుగోపాల్ తెలిపారు. 25 నుంచి 27వ తేదీ వరకు ఉపన్యాసం, భజన ఉంటుందన్నారు. 28న కుంకుమ, గోపూజలు చేపట్టనున్నట్టు వివరించారు.

పలమనేరు : ఉర్దూ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు


సదుం: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెలో యోగా చేస్తున్న విద్యార్థులు


ఆరోగ్యయోగం

"మానసిక సమస్యలను దూరం చేసుకోవాలి.. ఒత్తిడిని జయించాలి.. ఆరోగ్యకరంగా జీవనం సాగించాలి.. మనసుకు ఆత్మను ఏకం చేయాలి.. మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి.. ఇవన్నీ సిద్ధించాలంటే యోగాతోనే సాధ్యం. చిన్న వయసు నుంచే సాధన చేస్తే అద్భుత ఫలితాలు పొందవచ్చు" అని యోగా శిక్షకులు వెల్లడించారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పలు చోట్ల విద్యార్థులు.. అధికారులు.. ప్రజలతో ఆసనాలు వేయించారు.

- ఘనంగా అంతర్జాతీయ యోగాదినోత్సవం
- ఆసనాలు వేసిన విద్యార్థులు
- యోగాతో ఒత్తిడిని జయించవచ్చంటున్న శిక్షకులు



గుడుపల్లె : పీఈఎస్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు


పెద్దపంజాణి : యోగ ఆంగ్ల అక్షర రూపంలో విద్యార్థులు

పలమనేరు : పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం జరుపుకున్నారు. నార్త్ పాఠశాలలో యోగా మాస్టర్ నందగోపాల్, జెడ్పీ ఉర్దూపాఠశాలలో గ్రేడ్స్ సంస్థ నిర్వాహకుడు శేషాద్రి మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం కాదని అది తనువుకు, మనసుకు ఆత్మను ఏకం చేసే సాధన అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లోమనిషికి యోగా అవసరం చాలా ఉందన్నారు. మనిషికి ఆహారం ఎంత ముఖ్యమో వ్యాధుల నుంచి బయటపడేందుకు యోగాకూడా అవసరమేనని వెల్లడించారు. యోగాతో మానసిక సమస్యలు దూరమై మనసు పాజిటివ్‌గా మారుతుందన్నారు. భారతదేశానికి చెందిన యోగాను నేడు ప్రపంచదేశాలు పాటించడం మనకెంతో గర్వకారణమన్నారు. యోగా మాస్టర్ సాధియా ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ క్రమంలోనే ఉర్దూపాఠశాలలో పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన రూబియా, సల్మా, ఫాతిమాలకు ప్రైజ్‌మనీ అందజేశారు. కార్యక్రమాల్లో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, మధుమోహన్ పాల్గొన్నారు.

శాంతిపురంలో..

శాంతిపురం : మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. సోగడబల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తులసినాథ్, మండల అధ్యక్షుడు కాశీనాథ్ యోగా గొప్పదనాన్ని వివరించారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు మునస్వామి, కిషోర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యోగా శిక్షణ శిబిరం నిర్వహించారు. కూతేగానిపల్లెలోని శ్రీపరమహంస యోగానంద స్కూలులో 400 మంది విద్యార్థులతో యోగా ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో రాంచీకి చెందిన స్వామి శుద్ధానంద, స్వామి నిరంజనానంద, కరస్పాండెంట్ గోపాల్ అగర్వాల్, ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె : యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జయప్రకాష్ తెలిపారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు, అధ్యాపకులు ఆసనాలు చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ నేటి నుంచి ప్రతి రోజూ ఒక గంట సేపు విద్యార్థులకు


పలమనేరు : యోగా విశిష్టతను వివరిస్తున్న శేషాద్రి


చౌడేపల్లె : కాటిపేరి వద్ద ఆసనాలు వేస్తున్న ఉపాధి సిబ్బంది, కూలీలు

యోగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా కాటిపేరి పంచాయతీలో చేపట్టిన అమృత్‌సరోవర్ పని వద్ద ఉపాధి సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ బాలాజీ పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: సమాజంలో ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయిని, వాటిని దూరం చేసేందుకు యోగా సాధన అవసరమని యోగా టీచర్ మాధవి తెలిపారు. శుక్రవారం మండలంలోని చంద్రమాకులపల్లె జెడ్పీ హైస్కూల్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు మురళీధర్, జోతి, వెంకటరమణ, శైలజా, మంజునాథ్, ప్రభు, శంకర్‌రెడ్డి, సుజాత పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లె ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని హెచ్‌ఎం బాబు రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ క్రమంలో యోగ అనే ఆంగ్ల అక్షర రూపంలో విద్యార్థులు కూర్చొని వినూత్నంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, అంజప్ప, మాధవన్, రాజేష్ బాబు, గంగాధర్ పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: యోగాసనాలు భారతీయ సంస్కృతిలో భాగమని హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవంనిర్వహించారు. పూర్వ విద్యార్థి, యోగా టీచర్ రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం రమేష్‌ను సన్మానించారు.

కుప్పంలో..

కుప్పం రూరల్ : యోగాతోనే ఏకాగ్రత సాధ్యమని కొత్తయిండ్లు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్కొండనాయుడు తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మార్కొండనాయుడు మాట్లాడుతూ, యోగాతో ఏకాగ్రత సాధించవచ్చని సూచించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథం ఆధ్వర్యంలో విద్యార్థులు ఆసనాలు వేశారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె : సంపూర్ణ ఆరోగ్య ప్రయోజనాల కోసం రోజువారీ జీవితంలో యోగా చేయడం అవసరమని పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ కృష్ణారావు తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకున్నారు. యోగా శిక్షకులు మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనానికి యోగా అత్యంత అవసరమని తెలిపారు.


పలమనేరు : విద్యార్థినుల యోగా


శాంతిపురం : ఆసనాలు వేస్తున్న విద్యార్థులు


కుప్పం : యోగాసనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

29న జాతీయ లోక్ అదాలత్

పలమనేరు : పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టు, పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ఈనెల 29 జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన సీఐలు, ఎస్‌లతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గం కాబట్టి కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా కేసులను రాజీ చేసుకుని శాంతిపూర్వకంగా జీవించాలన్నారు. ఇందులో ప్రీలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు అదాలత్ చక్కటి అవకాశమని వెల్లడించారు. కక్షిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పోలీసులు పెండింగ్ కేసుల రాజీకి కృషిచేయాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

జాబ్ మేళాలో 21 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

పలమనేరు : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన స్పెషల్ జాబ్‌మేళాలో 21మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ వెంకటేశులు తెలిపారు. శ్రీజ మిల్క్ డెయిరీలో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అస్యూరెన్స్ ఉద్యోగాలకు సంబంధించి ఆ కంపెనీ హెచ్‌ఆర్‌లు ఇంటర్వ్యూలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగాలు దక్కించుకున్నవానికి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. జీవితంలో ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం, అధ్యాపకులు రవీంద్రనాథ్ రెడ్డి , దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సిరి'వరి

- వినూత్నంగా సాగు పద్ధతులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు


పలమనేరు మండలం కరిడిమొడుగు వద్ద శ్రీవరి విధానంలో సాగు

పలమనేరు : ఆరుగాలం కష్టించే అన్నదాత ఆదాయ మార్గంలో పయనించేలా వ్యవసాయశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. కొత్త విధానంలో సాగు చేసి అధిక లాభం కళ్లజూసేలా చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే శ్రీవరి సాగు పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నారు. నూతన ఒరవడిలో వరి సాగు చేపట్టేందుకు అన్నదాతలు ముందుకు రావాలని కోరుతున్నారు. ప్రతి గ్రామంలోనూ సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు క్షేత్రస్థాయిలో లాభాలను వివరిస్తున్నారు. కొత్త పద్ధతిపై ఆసక్తిని పెంచుకోవాలని సూచిస్తున్నారు.

పాత పద్ధతులతో వరి పంట సాగు చేసి దిగుబడి రాక కుదేలవుతున్న రైతన్నలను ఆదుకునేందుకు సృష్టించిందే శ్రీవరి సాగు విధానం. దీని ద్వారా రైతులకు పంట పెట్టుబడి తగ్గి మంచి దిగుబడితో పాటు అధిక లాభాలు పొందవచ్చునని పలమనేరు మండల వ్యవసాయశాఖ అధికారి సంధ్య సూచిస్తున్నారు .

తక్కువనీటితో సాగు

శ్రీవరి సాగు ప్రస్తుతం ఎంతో లాభదాయకంగా మారింది. మామూలు విధానంలోలాగా కాకుండా రెండు కేజీల వరి విత్తనాలతో ఎకరా శ్రీవరిని సాగు చేయవచ్చు. అంతేగాక నీటిని పొదుపు చేసుకోడానికి అవకాశముంటుంది. ఆరు తడులతోనే పంట కాలం పూర్తి చేయవచ్చు. ముఖ్యంగా పొట్ట దశ, పాలు పోసే దశ, వెన్నుదశ, గింజ గట్టి పడే దశలను గుర్తించి ఈ సమయాల్లో పొలంలో 5 సెంటీమీటర్ల వరకూ నీరుండేలా చూసుకుంటే చాలు. పాత పద్ధతులతో వరి 10 నుంచి 12 పిలకలు మాత్రమే వేస్తుంది. ఈ విధానంలో 60 నుంచి 100 పిలకల వరకూ ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుంది. దీనికి తోడు కూలీల ఖర్చు బాగా తగ్గుతుంది. మామూలు పద్ధతిలో ఎకరాకు 25 బస్తాలు దిగుబడి రావడమే గొప్ప. శ్రీవరిలో 50 నుంచి 70 బస్తాల దాకా దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కూలీల కొరత ఎక్కువగా ఉండడంతో ఈ విధానం రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ఇన్ని లాభాలున్న శ్రీవరి సాగుకు ఇప్పుడు వాతావరణం అనుకూలంగా ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో శ్రీవరిని సాగు పెంచేందుకు వ్యవసాయశాఖ, ఆర్‌బీకే సిబ్బంది సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో శ్రీవరి విధానంలో సేద్యం చేయిస్తున్నారు.

రైతులకు మేలు



శ్రీవరి విధానంలో వరి సాగు చేయడం రైతులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, తద్వారా చక్కటి ఆదాయం పొందవచ్చు. అందుకే వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో అన్నదాతలకు అవగాహన కల్పిస్తోంది. నూతన పద్ధతిని పాటించాలని సూచిస్తోంది.

– సంధ్య, ఏఓ, పలమనేరు

కమనీయం.. సీతారాముల కల్యాణం



టి.పుత్తూరులో అంగరంగవైభవంగా సీతారాముల కల్యాణం, గరుడునిపై ఊరేగుతున్న స్వామివారు

తవణంపల్లె: టి.పుత్తూరులోని కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవా రం సాయంత్రం సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయకర్తలు సుధాకర్ పిళ్లై కుటుంబసభ్యుల చేతుల మీదుగా తిరుమంజనం, ఉభయకర్త మురళిరెడ్డితో పాలాభిషేకం చేయించారు. సాయంత్రం ఉభయకర్త రామచంద్రనాయుడు కుటుంబసభ్యులతో వైభవంగా కల్యాణోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా ఉభయకర్త సీతారాములకు పట్టువస్త్రాలు, మంగళసూత్రాన్ని, పూలదండలు, ప్రసాదాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గరుడునిపై కోదండరాముడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయకర్త పాలాక్షి రెడ్డి కుటుంబసభ్యులు ఊరేగింపుగా ఉభయం తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం, సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి గజ వాహనం సేవ నిర్వహించనున్నట్లు ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రగతి పథంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు


ఢిల్లీలో అవార్డును అందుకుంటున్న సప్తగిరి బ్యాంకు చైర్మన్ ఏఎస్‌ఎస్ ప్రసాద్

చిత్తూరు అగ్రికల్చర్: సప్తగిరి గ్రామీణ బ్యాంకు లాభాలతో నడుస్తూ ప్రగతి పథంలో పయనిస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ ఏఎస్‌ఎస్ ప్రసాద్ తెలిపారు. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన డీఎఫ్‌ఎస్ సెక్రటరీ వివేక్ జోషి చేతుల మీదుగా అటల్ పెన్షన్ యోజన వార్షిక అవార్డు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో తమ బ్యాంకు రూ.350 కోట్ల నికర లాభం ఆర్జించిందన్నారు. పథకాల అమలులో కూడా ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు.